
సాక్షి
ఒడిశా

సోమవారం । 16 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,35,019 లు, బంగారం 8గ్రాము 850 మిల్లీగ్రాములు, వెండి 73 గ్రాములు 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సైబర్ నేరాలతో జాగ్రత్త

సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు.

- 8లో



చెరువులో పడి వృద్ధుడి మృతి

పొడియ సమితి నీలిగూడ పంచాయతీ హిరాల్‌గూండి గ్రామానికి చెందిన వృద్ధుడు చెరువులో పడి మృతిచెందాడు.

- 8లో

న్యూస్‌రీల్

గోపాల్‌పూర్ ఐఐసీ అధికారిగా శ్రీకాంత్



శ్రీకాంత్ కొమరి

బరంపురం : గోపాల్‌పూర్ పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా 2012 బ్యాచ్‌కు చెందిన శ్రీకాంత్ కొమరి బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకుముందు కొంధమాల్ జిల్లా రైకియా పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తామని తెలిపారు.

డీసీసీ నూతన కార్యవర్గం ఎంపిక

రాయగడ: జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు బిభూతి భూషణ్ మిశ్రా కార్యవర్గం జాబితాను ఆదివారం వెల్లడించారు. డీసీసీ అధ్యక్షుడిగా బిజయ కుమార్ గొమాంగొ ఇప్పటికే బాధ్యతలు చేపట్టగా ఉపాధ్యక్షులుగా శంకర్షన్ మంగరాజ్, సునీల్ పండా, పంచానన్ కరకరియా, సుబ్రాస్మిత జిలకర, దిలీప్ కుమార్ పట్నాయక్, సాధారణ కార్యదర్శులుగా పార్థొధ బర్ధన్ సాహుకార్, కొత్త సూర్యారావు, తంగుడు శ్రీధర్, బిజయకుమార్ ఉలక, సంధు చరన్ మాఝి, అశుతోష్ కిలక, అలేఖ చంద్ర హికబడి, నందిగొరి, కుని నిర్మల, త్రినాథ్ సాబరొ, కార్యదర్శులుగా రంజితనాయక్, దిబాస్ రైకా, శ్రీపతి ఉలక, గంగాధర్ బెహరా, రామప్రకాష్ కరకరియా, జుగురు మాఝి, భూషణ్ బిడిక, కిశోర్ కౌసల్య, ఎం.శంకరరావు, సత్యవతి మండంగి, ఊన్న ఫకీర్ మోహన, హలధర్ బాగ్, సతన శివాని, మురళి దండసేన, పి.రామకృష్ణ, సుధీర్ గురులు ఎంపికయ్యారు. మరో 26 మందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమితులయ్యారు.

అంతర్జాతీయ మిలెట్ పోటీలకు సబిత



సబిత రౌత్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

జయపురం: ఇంటర్‌నేషనల్ కన్వెర్షన్ ఆన్ మిలెట్ పోటీలకు జయపురానికి చెందిన సబిత రౌత్ ఎంపికయ్యారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీలో ఈమె ప్రథమ స్థానంలో నిలిచారు. భువనేశ్వర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్(ఐహెచ్‌ఎం) ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. 30 జిల్లాల విద్యార్థులు పాల్గొనగా కొరాపుట్ జిల్లాకు సబిత ప్రాతినిధ్యం వహించారు. ఈమె చోడి పిండితో తయారు చేసిన పిండి వంటలు ఆకర్షించాయి. నవంబర్ 10న ఢిల్లీలోని జనతా మైదానంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.

సుందర్‌గఢ్‌లో ఏనుగు కళేబరం

భువనేశ్వర్: సుందర్‌గఢ్ జిల్లా కొయిరా అటవీ పరిధిలోని ఒరాఘాట్ గ్రామ సమీపంలో ఆదివారం స్థానికులు ఏనుగు కళేబరాన్ని గుర్తించారు. శనివారం సాయంత్రం ఏనుగు మరణించినట్లు భావిస్తున్నారు. మృతికి కచ్చితమైన కారణం నిర్ధారించలేదు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఒరాఘాట్ గ్రామానికి చెందిన పరమ సాహికి చేరుకుని కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. కొద్ది రోజుల క్రితం ఇదే ప్రాంతంలో మరో ఏనుగు కళేబరం లభించింది. కొయిరా అటవీ పరిధిలో ఇటీవల కాలంలో నాలుగు ఏనుగులు మరణించాయి.

50 ద్విచక్ర వాహనాలు సీజ్



స్టేషన్ ఆవరణలో ద్విచక్ర వాహనాలు

జయపురం: నంబర్ ప్లేట్ నిబంధనలు ఉల్లంఘించిన ద్విచక్ర వాహనచోదకులపై జయపురం పట్టణ పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. రిజిస్ట్రేషన్ నంబర్ లేకుండా బైకులు నడుపుతున్న వారి ఆట కట్టించేందుకు శనివారం రాత్రి ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 50కు పైగా ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు చెప్పారు. తెలుపు బోర్డుపై నలుపు రంగులో అంకెలు రాసి నంబర్ ప్లేట్లు తీసుకువచ్చిన 47 మందికి తిరిగి వాహనాలు అప్పగించారు. మిగిలిన మూడు వాహనాలు స్టేషన్‌లో ఉంచామని తెలిపారు.

దేవీ వైభవం

దేవీ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా దుర్గాదేవి మండపాలు, ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. దేవీ ఆలయాలు, శక్తి పీఠాలు, పూజా మండపాల్లో అమ్మవారు బహుళ రూపిణిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఎక్కడికక్కడ అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

– భువనేశ్వర్/బరంపురం/రాయగడ/జయపురం/పర్లాకిమిడి



జయపురం: రాజనగర్ వద్ద పూజలందుకుంటున్న దుర్గాదేవి



భువనేశ్వర్: బొగొలాముఖి అలంకరణలో పిరాపూర్ ధకులై మాత



పర్లాకిమిడి: బాలసదన్ పాఠశాలలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



పర్లాకిమిడి: కుంకుమపూజలు చేస్తున్న మహిళలు



భువనేశ్వర్: వనదుర్గ అలంకరణలో కటక్ చవులియా గంజ్ జయ దుర్గా మాత



భువనేశ్వర్: వాసంతి దుర్గా మాతగా జగద్ధాత్రి



భువనేశ్వర్: మాతంగి రూపంలో గొడొగొడియా దక్షిణకాళీ మాత



జయపురం: భూపతివీధి దుర్గా మండపంలో వజ్ర మహంకాళిగా కనకదుర్గ



రాయగడ: ప్రత్యేక అలంకరణలో మజ్జిగౌరి అమ్మవారు



బరంపురం: పాతబస్టాండ్‌లో దుర్గాదేవి అమ్మవారు



భువనేశ్వర్: అన్నపూర్ణ స్వరూపిణిగా గొడొ చండీమాత



రాయగడ: న్యూకాలనీలో దుర్గాదేవికి పూజలు



పర్లాకిమిడి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



బరంపురం: గిరి మార్కెట్‌లో పూజలు అందుకుంటున్న దుర్గాదేవి



జయపురం: పూజలందుకుంటున్న మా భగవతి



బరంపురం: ఉత్కళ ఆశ్రమ రోడ్డు మండపంలో పూజలందుకుంటున్న దుర్గాదేవి



రాయగడ: రాజ్యలక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు



బరంపురం: పెద్దబజార్ మార్కెట్ జంక్షన్‌లో నవరాత్రి పూజలు అందుకుంటున్న దుర్గాదేవి

భక్తిశ్రద్ధలతో రాజఖడ్గం ఊరేగింపు

కొరాపుట్: బండారు ఘరణి శక్తి పీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఆలయం వద్ద వందలాది మంది భక్తులు రాచరిక ఆచారాలు పాటించారు. ప్రధాన అర్చకుడు రాజీవ్ నేతృత్వంలో రాజఖడ్గాన్ని అమ్మవారి అంశంగా భావించి బయటకుతెచ్చారు. మెయిన్ రోడ్డు మీదుగా ఊరేగించారు. గోండో గిరిజనుల మేళతాళాలతో భారీ బాణసంచా కాల్చుతూ సందడి చేశారు. గ్రామ సరిహద్దులో ఉన్న చెరువు వద్ద గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఖడ్గాన్ని శక్తి పీఠం వద్దకు తీసుకొచ్చి గర్భగుడి ముందు ప్రతిష్ఠించారు. శరన్నవరాత్రులు ముగిసే వరకు ఈ ఖడ్గాన్నే అమ్మవారిగా భావించి భక్తులు పూజలు చేస్తారు. ఖడ్గం సమీపంలో 1001 అఖండ దీపాలు వెలిగించారు. దశమి వరకు నిరంతరం కొనసాగుతాయి. రాజపురోహితుడు నర్సింగ త్రిపాఠి నేతృత్వంలో వేద పండితులు అమ్మవారి చండి పారాయణం ప్రారంభించారు. ప్రతి రోజు రాత్రిపూట ఈ పారాయణం రహస్యంగా కొనసాగుతుంది. అమ్మవారు శరన్నవరాత్రుల్లో తీక్షణంగా ఉంటుందని, ఆమెను శాంతపరచడానికి ఈ రహస్య చండీ హోమం జరుగుతుందని అర్చకులు చెబుతున్నారు. నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని దంపతులు, భక్తులు పాల్గొన్నారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న గిరిజనులు

మహిళా కార్యకర్తకు బెదిరింపులు

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ కార్యకర్తగా చెప్పుకుంటున్న ఓ మహిళ.. నిమపడా నియోజకవర్గం బీజేడీ ఎమ్మెల్యే సమీర్ రంజన్‌దాస్ పోకిరీలను ఉపయోగించి తనను బెదిరించారని ఆరోపించారు. ఈ నెల 9న కుసుపూర్ బజార్‌లో జన సంపర్క్ పాదయాత్ర సందర్భంగా నలుగురు వ్యక్తులు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, యాత్రలో పాల్గొన రాదని హెచ్చరించారు. లేకుంటే తనను, కారును తగులబెడతామని బెదిరించారని బాధిత మహిళ జ్యోత్స్నా రాణి నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బెదిరింపులు చేసిన పోకిరి బృందం ఎమ్మెల్యే సన్నిహితులని ఆరోపించారు. ఈ మేరకు పూరీ జిల్లా గోప్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు తనను మళ్లీ బెదిరించారని, ఈ నెల 11న కారును కూడా ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేడీ జెండా ఉపయోగించవద్దని హెచ్చరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనపై స్పందించేందుకు ఎమ్మెల్యే సమీర్ రంజన్ దాస్ నిరాకరించారు. బీజేడీ అభ్యర్థి, నిమాపడా మండల అధ్యక్షుడు అశోక్ సాహు మహిళ ఆరోపణలను ఖండించారు. ఫిర్యాదుదారు తమ పార్టీ ప్రాథమిక సభ్యురాలు కూడా కాదని స్పష్టం చేశారు. ఆమెకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తో సంబంధం ఉన్నట్లు మా వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు.

పుట్టిన రోజు వేడుకలకు దూరంగా సీఎం

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారంతో 77 ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు. ఈ సందర్భంగా తన నివాసం నవీన్ నివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేసేందుకు రావద్దని శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ప్రకటన విడుదల చేసింది. గత నెల తన సోదరి గీతా మెహతా మరణించినందున ఈ సంవత్సరం పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం లేదని సీఎం పేర్కొన్నారు.

ఏనుగు దాడిలో రైతు దుర్మరణం

భువనేశ్వర్: ఢెంకనాల్ జిల్లా మంగళపూర్‌కు చెందిన ఓ రైతు ఏనుగు దాడిలో దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మృతుడు రంజిత్‌రౌత్ (48)గా గుర్తించారు. రెండు రోజులుగా పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు తిరుగుతూ పంటలను నాశనం చేస్తుందని తెలియడంతో రంజిత్ తన పొలంలో వరి పంట పరిస్థితి చూసేందుకు వెళ్లాడు. ఇంతలో ఏనుగు దాడి చేసి తొక్కేసింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఏనుగుల గుంపుని తరలించేందుకు పగటి పూట మంటలు, డప్పుల చప్పుళ్లతో బెదరగొట్టే ప్రయత్నం చేసినా రాత్రి వేళల్లో చొరబడుతూ విధ్వంసం సృష్టిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న కొంటాబొణియా థాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు. మృతుని కుటుంబానికి పరిహారం మంజూరు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

6,340 కిలోల గంజాయి పట్టివేత

బరంపురం : నగర శివారులోని సరగడా గ్రామంలో నకిలీ గుట్కా కర్మాగారంపై ఎస్పీ సార్వణ్ వివేక్ ఆధ్వర్యంలో పోలీసు బృందం దాడులు చేపట్టింది. 6,340 కిలోల గంజాయి, 268 గ్రాముల బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దిగపండి పోలీసు స్టేషన్ పరిధిలోని సరగడా గ్రామంలో నకిలీ గుట్కా కర్మాగారంలో కాల్చివేశారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఎస్‌డీపీఓ, పాలన అధికారి పాల్గొన్నారు.



గంజాయి, బ్రౌన్ షుగర్‌ని కాల్చివేస్తున్న పోలీసులు



అద్భుతం.. అబ్దుల్ కలాం సైకతం

భారతరత్న, దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆదివారం గోపాల్‌పూర్ తీరంలో చేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. బెజ్జిపూర్, నీలకంఠ నగర 3వ లైన్‌కు చెందిన సైకత శిల్పి సత్యనారాయణ మహరణ అద్భుత కళా నైపుణ్యంతో ఇసుకతో తీర్చిదిద్దిన సైకత కళాఖండాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

- బరంపురం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో ఆదమ్మ

టెక్కలి రూరల్: స్థానిక జగతిమెట్ట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం చిన్నసాన పంచాయతీ పరిధి గంగుపేట గ్రామానికి చెందిన ఎస్.ఆదమ్మకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదమ్మ తన భర్త అచ్చయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై టెక్కలి వస్తుండగా.. జగతిమెట్ట సమీపంలో బొప్పాయిపురం గ్రామానికి చెందిన కె.రాంబాబు బైక్‌తో వెనుక నుంచి అచ్చయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆదమ్మకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆదమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు. ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత బలవన్మరణం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలం బాతుపురంలో ఆదివారం సాయంత్రం తెప్పల కుమారి (42) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కుమారి కుటుంబ సభ్యులతో కలిసి అండమాన్‌లో వలస కూలీలుగా బతుకుతున్నారు. కొన్ని నెలల క్రితం జీడి పిక్కల సేకరణ కోసం స్వగ్రామం వచ్చారు. ఊరిలో సర్వే జరుగుతున్న నేపథ్యంలో అండమాన్ వెళ్లకుండా ఇక్కడే ఒంటరిగా నివాసం ఉంటున్నారు. మృతురాలికు భర్త తెప్పల నీలకంఠేశ్వర్, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఇంటికి రోజూ పాలు పోసే కుర్రాడు ఆదివారం తలుపు కొడితే ఎవరూ తీయలేదు. ఎంతసేపయినా ఆమె కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారు అనుమానంతో ఇంటికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతికి గల కారణాలు తెలియరాలేదు. అప్పటి వరకు సరదాగా అందరితో కలిసి ఉన్న కుమారి మృతి చెందడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: టెక్కలి–మెళియాపుట్టి మార్గంలోని పాలసింగి గ్రామం సమీపంలో ఆదివారం కారు ఢీకొని సంతబొమ్మాళికి చెందిన కె.రామారావు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామారావు ఐస్‌క్రీమ్ విక్రయిస్తూ జీవిస్తుంటారు. తన ఐస్‌క్రీమ్ బండిపై వెళ్తుండగా పాలసింగి వద్ద చాపర నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి బండిని ఢీకొట్టి పొలంలోకి దూసుకుపోయింది. ప్రమాదంలో రామారావుకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఘటనపై ఏఎస్ఐ నర్సింగరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భారీగా నాటుసారా స్వాధీనం



బొలెరో వాహనంలోని నాటుసారా బస్తాలు

మందస: మందస పోలీసులు భారీగా నాటుసారాను పట్టుకున్నారు. ఈ నాటుసారా తీసుకువస్తున్న వాహనం తెలుగుదేశం పార్టీ మందస పట్టణ అధ్యక్షుడి సోదరుడిదే కావడం విశేషం. స్థానిక ఎస్ఐ హరికృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం టీడీపీ పట్టణ అధ్యక్షునిగా ఉన్న గార కృష్ణారావు తమ్ముడు పాపారావు బొలెరో వాహనాల తో వ్యాపారాలు చేస్తున్నారు. ఈ తరుణంలో పాపారావు వాహనంలో నాటుసారా రవాణా జరుగుతోందని పోలీసులు పసిగట్టారు. ఎస్ఐ హరికృష్ణతో పాటు పీసీలు కె.ఢిల్లేశ్వరరావు, శరత్‌లు చేపట్టిన ఆపరేషన్‌లో బొలెరో మాక్సిట్రక్‌తో మందస తీసుకువస్తున్న వెయ్యి లీటర్ల నాటుసారా బస్తాలు శనివారం వేకువజామున స్వాధీనం చేసుకున్నారు. సంఘటనపై పూర్తిస్థాయి వివరాలను సేకరించారు.
మందస పట్టణంలోని కిల్లమ్మవీధికి చెందిన తెలుకల గణేశ్‌తో నాటుసారాను వాహనంతో తీసుకువస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. చీపి పంచాయతీ బొందికరి గ్రామానికి చెందిన సవర గోపి, సవర బలరాం, కృష్ణలతో వాహనంలో ఒడిశా సరిహద్దులోని చిన్నకోస్టా సమీపంలో వీరికి నాటుసారా అందించినట్లు సమాచారం. బొలెరో వాహనంతో పాటు నాటుసారా రవాణాకు సంబంధించి ఎస్కార్ట్‌గా వెళ్తున్న కూడా టీవీఎస్ జూపిటర్ వాహనాన్ని కూడా సీజ్ చేశారు. గోపి, బలరాం, కృష్ణలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి గార పాపారావు పరారీలో ఉన్నాడని, నాటుసారా విలువ రూ.2.50లక్షలు ఉంటుందని ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

- అప్రమత్తంగా ఉండాలి
- సైబర్ సురక్ష అభిజాన్ ముగింపు సదస్సుల్లో వక్తలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముదలి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు

రాయగడ: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో పదిహేను రోజులుగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సైబర్ సురక్షా అభిజాన్ సదస్సులు ఆదివారంతో ముగిశాయి. రాయగడలోని బిజు పట్నాయక్ ఆడిటోరియంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదిలి, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవ్, రాయగడ కళాశాల ప్రిన్సిపాల్ బొబిలత షరప్‌లు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. సైబర నేరగాళ్ల ఆటకట్టించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎస్పీ వివేకానంద శర్మ మాట్లాడుతూసైబర్ సురక్షా అభిజాన్ కార్యక్రమంలో జిల్లాలో విజయవంతమైందన్నారు. నాటకాలు, నృత్యరూపాల్లోనూ కళాకారులతో చైతన్య కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇక ప్రజలే బాధ్యతగా వ్యవహరించి నేరాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. ఎటువంటి సమస్య ఎదురైనా తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాయగడ అటానమస్ కళాశాలకు చెందిన ప్లస్–3 విద్యార్థి ప్రీతీ చౌదరి మాట్లాడుతూ తాను సైబర్ నేరగాళ్ల బారిన పడినా తెలివిగా వ్యవహరించి బయట పడ్డానని వివరించారు. ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దన్నారు. అప్రమత్తంగా లేకపోతే మానసిక ఒత్తిడికి గురికావడంతో పాటు ఎంతో కోల్పోవాల్సి ఉంటుందన్నారు.

విజేతలు వీరే..

సైబర్ సురక్షా అభిజాన్‌లో భాగంగా నేరాల కట్టడికి పోలీస్ యంత్రాంగం ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో అభిప్రాయాలు సేకరించింది. ఇందులో ఉత్తమమైన వాటిని గుర్తించివిజేతలను ప్రకటించింది. సబ్‌కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రా దేవి లాటరీ పద్ధతిలో వీరిని ఎంపిక చేశారు. ఫేస్‌బుక్ విభాగంలో ప్రవీన్ చౌదరి, సరోజ్ మండల్, అరుణ్ భారతి తొలిమూడు స్థానాల్లో నిలిచారు. డేవిడ్ గౌరాడియా, సునీల్ త్రిపాఠి, అను రవణ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. ట్విట్టర్‌లో దేవాశీస్ ఖడంగ, ప్రవీన్ కుమార్ చౌదురి, సుగంధు సతపతి తొలిమూడు స్థానాల్లో నిలవగా, ఆకాష్ ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణుచరణ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లా పోలీసు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 14 వరకూ జరిగిన 'సైబర్ సేఫ్టీ ప్రచారం' ముగింపు సమావేశం పర్లాకిమిడిలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి శిక్షణా కేంద్రం హాలులో ఆదివారం జరిగింది. సంజయ్ కుమార్ పాఢి, జిల్లా ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్ అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని కాశీనగర్, గుమ్మా, గుసాని, రాయఘడ, నువాగడ, ఆర్.ఉదయగిరి, మోహనాలో సైబర్ మోసాలకు గురికాకుండా ప్రజలను చైతన్యం చేశామన్నారు. ఈప్రచారంలో కీలకపాత్ర పోషించిన గారబంద, సెరంగో, కాశీనగర్, రాయఘడ, ఆర్.ఉదయగిరి, మోహనా, అడవ తదితర పోలీసుస్టేషన్ల అధికారులు, బీడీఓలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆదనపు ఎస్పీ, అన్ని పోలీసుస్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ స్వాతి ఎస్.కుమార్



సర్టిఫికెట్ అందుకుంటున్న పర్లాకిమిడి ఆదర్శపోలీసుస్టేషన్ ఎస్ఐ సందీప్

కేంద్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం



మాట్లాడుతున్న కార్మిక నేత ప్రమోద్ మహంతి



జయపురంలో నిర్వహించిన దృశ్యం

జయపురం: కార్మిక, రైతు, సాధారణ పౌరులకు వ్యతిరేకంగా కేంద్రంలో ప్రధాని మోదీ పాలన సాగిస్తున్నారని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) ప్రతినిధులు ధ్వజమెత్తారు. రెండు రోజుల పాటు జరగనున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఆదివారం జయపురం బాబా సాహెబ్ కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ప్రముఖ కార్మిక నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్ మహంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి రామకృష్ణ పండా, రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ దాస్, సాధారణ కార్యదర్శి బిజయ జెనా, అఖిల భారత కృషక్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు ఆశిష్ కనుంగో, కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్వర రౌత్, ఉపాధ్యక్షుడు గౌరంగ పాణిగ్రహి, నాయకులు జయంతి దాస్, మాయాధర నాయక్, నిఖిల ఒడిశా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సాధారణ కార్యదర్శి హరిప్రియ స్వైయ్, సేవా పేపర్ మిల్ కార్మిక యూనియన్ సాధారణ కార్యదర్శి ప్రదీప్ పంగియ, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రౌళో తదితరులు ప్రసంగించారు. అవిభక్త కొరాపుట్ అభ్యున్నతికి వ్యవసాయం, ఉద్యోగ అవకాశాలు గల పరిశ్రమల ఏర్పాటు, సేవాపేపరుమిల్లుతో పాటు మూతపడిన ఫ్యాక్టరీలు తెరిపించాలని నినదించారు. అటవీ సంపదను కార్పొరేట్లకు ధారదత్తం చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. భూమిలేని పేదలకు, ఆదివాసీలకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. అంతకుముందు లక్ష్మీ పండా కూడలి నుంచి ర్యాలీ నిర్వహించారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి



చెరువు గట్టుపై వృద్ధుడి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియ సమితి నీలిగూఢ పంచాయతీ హిరాల్‌గూండి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు చెరువులో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కస మాడ్కమి (60) తన మేనల్లుడు రామ మడ్కామి ఇంటికి వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం స్నానానికి సమీప చెరువుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ జారిపడి మునిగిపోయాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో మేనల్లుడు వెళ్లి చూడగా గట్టుపై దుస్తులు కనిపించాయి. వెంటనే పోడియ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా సిబ్బంది వచ్చి గాలించారు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సందేహాలు నివృత్తి చేసుకోండి

- రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచన



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల సామగ్రి భద్రత, ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమకున్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) గోదాములను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్‌కర్, ఎస్పీ జీఆర్ రాధికలు ఆదివారం తనిఖీ చేశారు. సోమవారం నుంచి సుమారు 20 రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈవీఎంల మొదటి దశ తనిఖీలను బెంగళూరు బీఈఎల్ ఇంజినీర్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ ఆదివారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు తనిఖీలను చేయనున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసేందుకు ఈ తనిఖీలకు హాజరు కావాలని సమాచారం అందజేశారు. ఈవీఎం గోదాముల వద్ద భద్రత, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొదట విడతలో వీవీ పాట్స్ 7080, కంట్రోల్ యూనిట్స్ 5831, బ్యాలెట్ యూనిట్స్ 7523 చేరుకున్నాయని ఈవీఎంల తనిఖీల నిర్వహణ సమయంలో మొబైల్ ఫోన్లు లోపలికి అనుమతించడం జరగదని, ఏర్పాటు చేసిన కౌంటర్లలో విధిగా డిపాజిట్ చేయాలని చెప్పారు. డిజిటల్ చేతి గడియారం, ఎయిర్ పాడ్స్ అనుమతించరని ఆయన వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై ఎలాంటి సందేహాలు ఉన్నా నిపుణుల వద్ద నివృత్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, సూపరింటెండెంట్ బి.ప్రకాశరావు, డీటీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మ తల్లి.. మా కల్పవల్లి



కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు విద్యుత్ దీపాల అలంకరణ(ఇన్‌సెట్‌లో) కొత్తమ్మ తల్లి

- రేపటి నుంచి మూడురోజులు కొత్తమ్మ తల్లి జాతర
- ఐదు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- పక్కాగా ఏర్పాట్లు

టెక్కలి, కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల కల్పవల్లి.. కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు అంగరంగ వైభవంగా ఉత్సవం జరగనుంది. ఏటా ఎంతో ఆర్భాటంగా నిర్వహించే ఈ ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ప్రత్యేక ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో పాటుదేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులు రానున్నట్లు అంచనా మేరకు పక్కాగా ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బోయిన నాగేశ్వరరావు నేతృత్వంలో ఈఓ వాకచర్ల రాధాకృష్ణ పర్యవేక్షణలో పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు, గ్రామస్తుల సహకారంతో మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

● స్థల పురాణం

కొత్తమ్మ తల్లి స్థలపురాణంపై ఓ కథ స్థానికంగా ప్రచారంలో ఉంది. 1925లో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతుంటారు. స్థానికులు చెప్పుకుంటున్న స్థల పురాణం ప్రకారం.. 1925 ప్రాంతంలో కోటబొమ్మాళి గ్రామానికి చెందిన కమ్మకట్టు చినప్పలనాయుడు అనే వ్యక్తి ప్రతి గు రువారం గ్రామం సమీపంలో గల నారాయణవలస సంతకు వెళ్తుండేవారు. ఎప్పటి లాగే సంత ముగించుకుని ఎద్దుల బండిపై తిరిగి వస్తుండగా ఓ మహిళ అప్పలనాయుడును ఆపి కోటబొమ్మాళి వరకు తనను తీసుకువెళ్లాలని కోరింది. దీంతో అప్పలనాయుడు సరే అన్నాడు. ఆమె బండి ఎక్కి న తర్వాత బండి బాగా బరువెక్కింది. బండి కోటబొమ్మాళి పొలిమేరకు వచ్చాక ఆమె పట్నాయకుని వెంకటేశ్వరరావుకు చెందిన తోటలోకి వెళ్లిపోయింది. అలా కొంత దూరం వెళ్లి అదృశ్యమైంది. దీంతో అప్పలనాయుడు భయపడి వడి వడిగా ఇంటికి చేరుకున్నాడు. అదే రోజు రాత్రి అప్పలనాయుడు నిద్రిస్తున్న సమయంలో కలలో మహిళ కనిపించి తాను పూసపాటి రాజులు కొలిచిన ఆదిశక్తినని, తనను కొత్తమ్మ తల్లిగా పూజించాలని సూచించింది. పట్నాయకుని వెంకటేశ్వరరావు తోటలో గల వేపచెట్టు, ముషిడికి చెట్టు కలిసి ఉన్న ప్రదేశంలో పుట్ట వద్ద తన శక్తి నిక్షిప్తమై ఉందని చెప్పడంతో అప్పటి నుంచి అదే ప్రాంతంలో పూజ లు చేయడం ప్రారంభించారు. ఏటా పోలాల అమావాస్య తరువాత వచ్చే నవరాత్రుల్లో సంబరాలు చేయాలని అమ్మ ఆదేశించింది. అప్పటి నుంచి ఏటా కమ్మకట్టు కుటుంబానికి చెందిన వారు అమ్మవారికి పూజలు నిర్వహించిన తర్వాత ఉత్సవాలు ప్రారంభిస్తున్నారు.

'ప్రత్యేక బస్సులు సద్వినియోగం చేసుకోండి'



మాట్లాడుతున్న శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మాధవ్

శ్రీకాకుళం అర్బన్: దసరా పండగ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ నడపనున్న ప్రత్యేక బస్ సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20, 21వ తేదీల్లో హైదరాబాద్ నుంచి శ్రీకాకుళంకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే విజయవాడ, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, విశాఖపట్టణాలకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 20వ తేదీ నుంచి ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సెలవులు ఇవ్వనున్నారని, వారిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ, గుంటూరు, ఒంగోలు, రాజమండ్రి, అమలాపురం తదితర ప్రాంతాలకు శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి 9 బస్సులు, శ్రీకాకుళం రెండో డిపో నుంచి 5 బస్సులు, టెక్కలి నుంచి 4 ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం పడకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ప్రత్యేక సర్వీసులకు సాధారణ చార్జీలతోనే నడపుతామని, ఎలాంటి అదనపు చార్జీలు లేవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్టీసీ టీఐ–3 ఎల్ఎస్ నాయుడు, ఏడీసీ ఎంపీ రావు పాల్గొన్నారు.

'వైద్యులు నిరంతరం పరిజ్ఞానం పెంచుకోవాలి'

శ్రీకాకుళం రూరల్: వైద్యులు నిరంతరం తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని హెల్త్ యూనివర్సిటీ వీసీ కె.బాబ్జి అన్నారు. భారతీయ వైద్య సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ విభాగం కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాగోలు, శ్రీకాకుళం ఆస్ప త్రుల సంయుక్త నిర్వహణలో ఆదివారం జెమ్స్ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఐఎంఏ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పా ల్గొని మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జెమ్స్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ముందుగా వర్చువల్ విధానంలో సదస్సును ప్రారంభించారు. తమ కళాశాల ద్వారా వైద్య సదస్సులు నిర్వహించడానికి ఎల్లప్పుడూ సహ కరిస్తామన్నారు. డాక్టర్ కె.సుధీర్, సంస్థ నిర్వా హకులు రామ్మోహన్ రావు, ఆద్విక్‌లు ప్రజలు ఉపయోగపడే వైద్య కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించడానికి రాగోలు వైద్య కళాశాలను నిత్యం అందుబాటులో ఉంచుతామన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మా ట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఐఎంఏ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 10 మంది నిష్ణాతులైన వైద్యులు పలు అంశాలను వివరించారు.

జాతీయ పోటీల్లో పలాస విద్యార్థిని ప్రతిభ



సాధించిన కాంస్య పతకంతో యామిని

కాశీబుగ్గ: తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో జరుగుతున్న సౌత్‌జోన్ జాతీయ క్రీడాపోటీల్లో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండ ప్రాంతం నేతాజీ నగర్‌కు చెందిన అడప యామిని రాణించింది. ఆదివారం జరిగిన 3000 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం గెలిచింది. తండ్రి అడప కూర్మారావు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా తల్లి శకుంతల జీడి పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేసి కుమార్తె యామినిని చదివిస్తున్నారు. పలాస ప్రభుత్వ క్రీడా మైదానంలో కోచ్ కొణతాల రామారావు సారథ్యంలో గత కొంత కాలంగా శిక్షణ పొందింది. ఈమె ప్రస్తుతం పలాసలోని కణితీస్ ఐటీఐ కాలేజీలో ఎలక్ట్రికల్ విభాగంలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. విద్యార్థినికి కొణతాల రామారావు, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్ అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ఈవీఎం గోదాముల తనిఖీ



ఈవీఎం గోదాములను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్పీ రాధిక

పార్వతీపురం టౌన్: పట్టణంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్పీ జీఆర్ రాధిక ఆదివారం తనిఖీ చేశారు. సోమవారం నుంచి సుమారు 20 రోజుల పాటు ఈవీఎంల మొదటి దశ తనిఖీలను బెంగళూరుకు చెందిన బీఈఎల్ ఇంజినీర్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు దీనికి సంబంధించి ఏర్పాట్లును కలెక్టర్, ఇన్‌చార్జి ఎస్పీ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తనిఖీలు చేయనున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసేందుకు మొదటి దశ ఈవీఎంల తనిఖీలకు ప్రతీ రోజు హాజరు కావాలని ఇప్పటికే సమాచారం ఇచ్చారు. ఈవీఎం గోదాముల వద్ద భద్రతను, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 3242 బ్యాలెట్ యూనిట్లు, 2559 కంట్రోల్ యూనిట్లు, 3162 వీవీ ప్యాట్‌లు కలిపి మొత్తం 8980 కేటాయించినట్లు తెలిపారు. ఎనిమిది బ్యాలెట్ యూనిట్లు, రెండు కంట్రోల్ యూనిట్లు, 17 వీవీ ప్యాట్‌లు మొత్తం 27 తిరిగి పంపించడం జరిగిందన్నారు. ఈవీఎంల తనిఖీల నిర్వాహణ సమయంలో మొబైల్ ఫోన్లు లోపలికి అనుమతించడం జరగదని, ఏర్పాట్లను చేసిన కౌంటర్లలో విధిగా డిపాజిట్ చేయాలని తెలిపారు. డిజిటల్ వాచీలు, ఎయిర్ పాడ్స్ అనుమతించరని తెలిపారు. వారి వెంట ఇన్‌చార్జి డీఎస్పీ జి.మురళీధర్, తహసీల్దార్ ఎన్ శివన్నారాయణ, ఈ సెక్షన్ పర్యవేక్షకుడు డి. రవికుమార్, డీటీ వెంకటరమణ, బీజేపీ, బీఎస్పీ, టీడీపీ, వైఎస్సార్‌సీపీ రాజకీయ పార్టీల ప్రతినిధులు పారిశర్ల అప్పారావు, ఎ.భాస్కరరావు, బి.సీతారామరావు, సీహెచ్ సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

డిసెంబర్ 11 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'



డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు

పార్వతీపురం టౌన్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం డిసెంబర్ 11 నుంచి జనవరి 15 వరకు జరుగుతుందని డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరుతో మాట్లాడారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన క్రీడా సామగ్రి జిల్లా కేంద్రానికి చేరుకున్నాయన్నారు. ఫిట్ ఆంధ్రా ధ్యేయంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గ్రామం, ప్రాంతంలో గల స్థానిక క్రీడలతో సహా మూడు కిలోమీటర్ల మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి క్రీడలు ముఖ్యంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలను పురుషులు, మహిళలకు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఆయా గ్రామాలకు చెందిన అభ్యర్థులు క్రీడలలో పాల్గొనవచ్చన్నారు. గుర్తింపు కార్డుగా ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు చూపించాలని పేర్కొన్నారు. క్రీడలలో పాల్గొనే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

సాలూరు: పట్టణంలోని చిట్లువీధిలో ఓ వ్యక్తి మృతిచెందగా, అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ చిట్లువీధిలో నివాసముంటున్న కూర్మాపు ప్రసాదరావు(73) మరణించి ఇంటి మెట్ల వద్ద పడి ఉన్నాడు. మృతుడి తమ్ముడు రమేష్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశామని, ఎస్సై విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం

విజయనగరం రూరల్: చేతులు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని వైఎస్సార్ క్రాంతి పథం (డీఆర్‌డీఏ) ఏపీఎం పీపీ నాయుడు అన్నారు. వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలతో గుండాలపేటలో చేతుల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భోజనానికి ముందు చేతులను పరిశుభ్రంగా కడుక్కుని భుజించాలని, తద్వారా అనారోగ్య సమస్యలు రావని చెప్పారు.

కొలువుదీరిన ఆపస్ నూతన కార్యవర్గం

సాలూరు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు, పరిశీలకుడు జాగాన రామునాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని వేదసమాజం పాఠశాలలో జరిగిన ఎన్నికలో జిల్లా శాఖ అధ్యక్షుడిగా సాదాపు శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాలి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుతో కూడిన కార్యవర్గం ఎన్నికైంది. నూతన కార్యవర్గానికి అందరూ అభినందనలు తెలిపారు.

అమ్మ అడుగిడిన వేళ

- భక్తిశ్రద్ధలతో సిరిమాను చెట్టు తరలింపు
- శ్రీ పైడితల్లమ్మ నామస్మరణతో మార్మోగిన జరజాపుపేట
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు, పాల్గొన్న ప్రజాప్రతినిధులు
- హుకుంపేటకు చేరుకున్న సిరిమాను



అమ్మవారి చెట్టును కొడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



అమ్మవారి చెట్టును కొడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

నెల్లిమర్ల:

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీ పైడితల్లమ్మ వారి సిరిమాను చెట్టును నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో గుర్తించగా తరలింపు కార్యక్రమం ఆదివారం వేలాది మంది భక్తుల నడుమ వేడుకగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజాప్రతినిధులు తరలిరాగా జయజయధ్వానాల నడుమ, మేళతాళాలతో ఊరేగింపుగా సిరిమాను చెట్టును తరలించారు. అంతకు ముందు వేలాదిగా భక్తులు చెట్టు వద్దకు చేరుకున్నారు. వేకువ జాము నుంచి పూజలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో జరజాపుపేట మార్మోగింది. సిరిమాను చెట్టు దర్శనానికి విచ్చేసిన భక్తులకు జరజాపుపేట ప్రజలు అన్న సమారాధన నిర్వహించారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారి సిరిమాను చెట్టు జరజాపుపేట నుంచి నెల్లిమర్ల మిమ్స్ మీదుగా కొత్తపేట నీళ్ల ట్యాంకు, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, కమ్మవీధి, బాలాజీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, వనంగుడి నుంచి హుకుంపేటలోని సిరిమాను అధిరోహించే పూజారి వెంకటరావు ఇంటి వద్దకు చేరుకుంది. జరజాపుపేటలో సిరిమాను చెట్టును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు దర్శించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఆర్‌డీఓ ఎంవీ సూర్యకళ, ఆలయ ఈఓ సుధారాణి, ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు, డీఎఫ్ఓ ఎస్.వెంకటేష్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు సిరిమాను చెట్టును దర్శించుకున్నారు.

దారులన్నీ అమ్మ వైపే...

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీపైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా కీలక ఘట్టమైన సిరిమానోత్సవానికి సంబంధించిన సిరిమాను, ఇరుసుమానులను ఆదివారం నెల్లిమర్ల మండలం జరజాపుపేట గ్రామం నుంచి ప్రత్యేక పూజలు అనంతరం భాజాభజంత్రీలతో తీసుకువచ్చారు. ఓ వైపు రహదారులన్నీ అమ్మకోసం ఎదురు చూడసాగాయి. భక్తులందరూ అమ్మవారికి సిరిమాను కోసం ఎదురుచూశారు. బిందెలతో పసుపు నీటిని కలిపి సిరిమానుపై పోసి, అమ్మకు చల్లదనం చేశారు. ఎటుచూసినా భక్తజన సందోహమే.. ఆనందదాయక మే. దారి పొడవునా పైడితల్లి దీక్షాధారుల భజనలతో, అమ్మ నామసంకీర్తనలతో, మైక్ అనౌన్స్‌మెంట్లతో భక్తుల్లో భక్తిభావాన్ని పెంచారు. అమ్మ రాకకోసం నిరీక్షణ చేసినవారంతా సిరిమానును ముట్టుకుని ఆనందపరవశులయ్యారు. సిరిమాను జరజాపుపేట గ్రామం నుంచి బయలుదేరి అమ్మవారి వనంగుడి వద్దకు రాత్రి సుమారు 9.30 ప్రాంతంలో చేరు కుంది. అక్కడ సిరిమానుకు భక్తులు పూజలు నిర్వహించిన అనంతరం గాడీఖానా, ఎన్‌సీఎస్ రోడ్డు, కన్యకపరమేశ్వరీ కోవెల, గంటస్తంభం మెయిన్ రోడ్డు, పాత సోనియా జంక్షన్, శివాలయం వీధి నుంచి సుద్ద వీధి మీదుగా హుకుంపేటలో ఉన్న పూజారి బంటుపల్లి వెంకటరావు ఇంటి వద్దకు తీసుకువెళ్లారు. నేటి నుంచి అక్కడ చింతమానును సిరిమానుగా మలిచే ప్రక్రియ నిర్వహించి, ఈ నెల 31న నిర్వహించే సిరిమానోత్సవానికి సిద్ధం చేస్తారు.



నగరంలోని కొత్తపేట జంక్షన్ రోడ్డులో సిరిమాను చెట్టును తీసుకువస్తున్న భక్తులు

పైడిమాంబ దీవెనలు ప్రజలందరిపైనా ఉండాలి

విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం శ్రీపైడితల్లి అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరిపైనా ఉండాలి. జరజాపుపేట గ్రామంలో చల్లని తల్లికి సిరిమాను చెట్టు సాక్షాత్కరించడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టం. ఈ నెల 30, 31వ తేదీల్లో జరగనున్న జాతర మహోత్సవాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసాం. పూర్తిగా వీఐపీ పాసులు రద్దు చేసాం.

– కోలగట్ల వీరభద్రస్వామి, డిప్యూటీ స్పీకర్

అందరిపై అమ్మవారి ఆశీస్సులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఉండాలి. జరజాపుపేట పైడితల్లమ్మ రావటం ఆ గ్రామ ప్రజల అదృష్టం. సుదూర ప్రాంతాల నుండి భక్తులు జిల్లాకు అమ్మవారి దర్శనానికి వస్తారు. ముఖ్యంగా ఒడిశా, చత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పైడితల్లి జాతరకు వస్తారు. కలెక్టర్ ఆధ్వర్యంలో దేవదాయ శాఖ, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్

మౌనికను ఆదర్శంగా తీసుకోవాలి



రెడ్డి మౌనికను అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: టెన్నికాయిట్‌లో అంతర్జాతీయస్థాయిలో జిల్లా, రాష్ట్ర ప్రతిష్టను చాటి చెప్పిన రెడ్డి మౌనికను యువత, క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఇటీవల సౌత్‌ఆఫ్రికాలో జరిగిన ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్ షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచి బంగారు పతకం సాధించిన రెడ్డి మౌనికతో బాటు కోచ్ రామారావును ఆదివారం ఆయన అభినందించారు. మారుమూల ప్రాంతంలో జన్మించినప్పటికీ కోచ్ రామారావు సహకారంతో మౌనిక ఎంతో కష్టపడి క్రీడలో మెలకువలు నేర్చుకుని ఒక్కో మెట్టు ఎదగడం గొప్ప విషయమని ప్రశంసించారు. భవిష్యత్‌లో ఎన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పీసీ స్వరూప్, కోరాడ వేణు, మంగళగిరి శ్రీను, ఇప్పిలి తిరుమల తదితరులు ఉన్నారు.

అటవీ సంపద అక్రమ రవాణా



దోనుబాయి రేంజ్‌లో అక్రమరవాణాకు సిద్ధం చేసిన టేకు కలప

- రాత్రివేళ తరలిపోతున్న విలువైన కలప
- చోద్యం చూస్తున్న అటవీశాఖ

సీతంపేట: కలప అక్రమ వ్యాపారులకు పార్వతీపురం మన్యం జిల్లా రాజమార్గంలా మారింది. అటవీశాఖ కళ్లెదుటే విలువైన అటవీసంపద అక్రమ మార్గంలో తరలిపోతున్నా చేష్టలుడిగి చూడాల్సిన పరిస్థితి దాపురించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో టేకు, నేరేడు, సరుగుడు, గంధ్ర, అకేషియా, ఇరిడి వంటి నాణ్యమైన కలపకు ఢోకా లేదు. దీంతో పాలకొండ, రాజాం, కొత్తూరు, వీరఘట్టం, రొట్టవలసకు చెందిన కలప వ్యాపారులు అక్రమంగా తరలిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న మైదాన ప్రాంతాల ద్వారా విలువైన టేకు, ఇతర రకాల కలపను విస్తారంగా దోచుకుపోతున్నారు. ఏటా లక్షలాది రూపాయల కలప తరలిపోతుండడం షరా మామూలుగా మారింది. చెట్లు నరికివేయడం ఒక్క పర్యావరణానికి ముప్పు మాత్రమే కాకుండా ఆదివాసీల జీవనస్థితిగతులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే ఎండలతో సతమతమవుతున్న ఆదివాసీలకు అడవులు ఖాళీ అవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

గతంలో కలప అక్రమరవాణా నియంత్రణ, నివారణకు బేస్‌క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. వాటిలో సిబ్బంది ప్రస్తుతం నామమాత్రంగానే ఉన్నారు. అక్రమ రవాణా జరుగుతున్న పాలకొండ, వీరఘట్టం వంటి ప్రాంతాల్లో ఉన్న చెక్‌పోస్టులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా కలప స్మగ్లర్లను నియంత్రించకపోతే అడవిమొత్తం నాశనం అవుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ రవాణా చేస్తే చర్యలు

కలప అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు. బేస్‌క్యాంపులను కూడా ఏర్పాటు చేశాం. కలప రవాణా చేస్తే తప్పనిసరిగా అటవీ శాఖ పర్మిషన్ ఉండాలి. ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా చూస్తున్నాం. రెవెన్యూ నుంచి సర్టిఫికెట్ తీసుకుంటే కొన్ని రకాల కలప రవాణాకు వెసులు బాటు ఉంది.

– తవిటినాయుడు, ఫారెస్టు రేంజర్, పాలకొండ

ప్రపంచానికి ఆధారం సనాతన ధర్మం



రుద్రకోటీశ్వర శర్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు

రాజాం: ప్రపంచాన్ని సనాతన ధర్మం నడిపిస్తుందని ఖండ్యాం శారదాపీఠం వ్యవస్థాపకుడు, శతాధిక దేవాలయ ప్రతిష్ఠాపనాచార్యులు అంపోలు రుద్రకోటీశ్వరశర్మ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వంతో పాటు దేవాదాయ-ధర్మాదాయ శాఖ నిర్వహిస్తున్న ధర్మప్రచార వారోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రవచనాలు ఇచ్చారు. సనాతన ధర్మం అంటే హిందూ ధర్మమని, ఎక్కడికి వెళ్లినా ఈ ధర్మం మూలాలు ఉంటాయని పేర్కొన్నారు. వేదాలు ఎంతో శక్తివంతమైనవని, వేదాలను ఆచరించిన వారు వారి మనసును సైతం నిగ్రహించగలరని పేర్కొన్నారు. ద్వైత్వం, అద్వైతం, విశిష్టద్వైత మతాలు హిందూ ధర్మం గొప్పతనాన్ని, గురువుకు, రాజుకు ఉన్న బంధాన్ని, గురువు విశిష్టతను, దైవశక్తిని వివరించాయని తెలిపారు. మనసును లగ్నం చేయాలంటే విశేషమైన ఆధ్యాత్మికత ఉండాలని, ఆధ్యాత్మికత సాధించాలంటే నిరంతరం భగవన్నామస్మరణతో పాటు ఇతరులకు సేవ చేసే సంకల్పం ఉండాలని పేర్కొన్నారు.

ప్రవచనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ఈ ప్రవచన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని, ప్రజలు అంతా ఈ కార్యక్రమాలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అనంతరం ఆయన రుద్రకోటీశ్వరశర్మను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, సలాది తులసీమాస్టారు, అర్నిపల్లి వెంకటనాయుడు మాస్టారు, దేవాదాయ శాఖ ఈఓ బీవీ మాధవరావు, ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, ఆలయ అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ, రంపా జగదీశ్వరరావు శర్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి జార్ఖండ్ వాసి మృతి

పాచిపెంట: మండలంలోని గురువు నాయుడు పేట సమీపంలో నిర్మాణం జరుగుతున్న హరిత రహదారిపై శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ వాసి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ నుంచి రాయపూర్ వరకు నిర్మాణం చేపట్టిన హరిత రహదారి పనుల కోసం జార్ఖండ్ నుంచి వచ్చిన కైలాస భరక్ పని ముగించుకుని తిరిగి వారి శిబిరానికి వస్తున్న సమయంలో, అటుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న గురువు నాయుడు పేట గ్రామానికి చెందిన సన్యాసిరావును లిఫ్ట్ అడిగా ద్విచక్ర వాహనంపై వస్తుండగా రహదారిపై ఉన్న మొక్కజొన్న కుప్పను చూసుకోకుండా వాహనచోదకుడు ఎక్కించడంతో, ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది, ఈ ప్రమాదంలో జార్ఖండ్ వాసి కైలాస భరక్ తల వెనుక భాగాన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మతి చెందాడు, సన్యాసిరావుకు స్వల్ప గాయాలయ్యాయని, దీనిపై కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించినట్లు హెచ్‌సీ కృపారావు తెలిపారు.

కేఎల్ పురంలో చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక కేఎల్.పురంలోని భవానీనగర్‌లో ఆదివారం వేకువజామున ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి, బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. భవానీనగర్‌లో నివాసం ఉంటున్న టొంపల విజయ ఉదయం 4.30 గంటల ప్రాంతంలో లేచి చూసే సరికి ఇంట్లో గది తలుపులు తెరిచి ఉండడంతో పాటు కిటికీ గ్రిల్స్ తొలగించి ఉన్నాయి. దీంతో ఆమె పరిశీలించగా బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఆమె భర్త పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి 2006లో మృతిచెందారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై వి.అశోక్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపురూపం.. అమ్మ నిజరూపం



కోటదుర్గమ్మ



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- జనసంద్రంగా మారిన పాలకొండ
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు
- ప్రత్యేక పూజలు చేసిన స్పీకర్ దంపతులు



పురోహితుల ఆశీర్వచనాలు పొందుతున్న స్పీకర్ సీతారాం, వాణి దంపతులు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. రాజుల కోటలో వెలసిన కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సమక్షంలో పురోహితులు శాస్త్రోక్తంగా కోటదుర్గమ్మ మూహుర్తపు రాటను వేశారు. ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పులకించిన భక్తజనం

ఏడాది ఒక్క రోజు కొన్ని గంటలు మాత్రమే కనిపించే అమ్మవారి నిజరూప దర్శనం కోసం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారి నిజరూప దర్శన భాగ్యంతో భక్తులు పులకించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

కోటదుర్గమ్మ నిజరూప దర్శనంతో అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శాసనసభ సభాపతి తమ్మినేని సీతారాం, వాణి దంపతులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పురోహితుల ఆశీర్వచనాలు పొందారు. ఆర్డీఓ కె.హేమలత, డీఎస్పీ కృష్ణారావు, పాలకొండ, రేగిడి జెడ్పీటీసీలు పాలవలస గౌరీపార్వతీ, పాలవలస ఇందుమతి, జిల్లాలోని పలు ప్రాంతాల ఉన్నతాధికారులు, దేవదాయ శాఖ అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరందరికీ ఆలయ కార్యనిర్వహణాధికారి మురళీకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

పోటెత్తిన భక్తులు

అమ్మవారి దర్శనానికి లక్షల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఎన్నడూ లేని విధంగా భక్తులు తరలిరావడంతో పాలకొండ పట్టణం జన సంద్రంగా మారింది. క్యూలైన్లు వద్ద భక్తులు గంటల తరబడి బారులు తీరారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకండా డీఎస్పీ కృష్ణారావు, సీఐ మురళీధర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అన్నదానం

అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుల కోసం ఆలయ ఆవరణలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో ఉచిత అన్నదానం, తాగునీరు, అందించారు.

జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గజపతినగరం: జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గజపతినగరం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ బడేటి వెంకటరామయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయింత్రం గజపతినగరంలో జరిగిన నూతన కార్యవర్గం ఎన్నికలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో దివంగత డాక్టర్ బీఎస్సార్ మూర్తి, నాగనరేంద్రలు నడిపించినట్లుగానే కార్యవర్గాన్ని ముందుకు నడిపించాలని, వారి అడుగు జాడల్లో నడుచుకోవాలని అధ్యక్షురాలిగా నూతనంగా ఎన్నికైన బెల్లాన లక్ష్మీ నరేంద్రకు సూచించారు. వెయిట్ లిఫ్టింగ్ అభివృద్ధికి కావాల్సిన చర్యలపై బాధ్యత తీసుకోవాలని చెప్పారు.

నూతన కార్యవర్గం సభ్యులు

జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షురాలిగా బెల్లాన లక్ష్మీ నరేంద్ర, కార్యదర్శిగా చల్లా రాము, ట్రెజరర్‌గా జి.జగదీశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా డీఎస్‌వీఎల్.ఎన్ రాజు, ఆర్.లక్ష్మీ గాయత్రి, జాయింట్ సెక్రటరీలుగా బి.అశ్విని, పి.వెంకటేశ్, ఎ.లక్ష్మునాయుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఎ.రవికుమార్, వై.అచ్యుతకుమారి, సభ్యులుగా డి.సత్యనారాయణ, బి.రమణ, ఆర్.సన్యాసి, పి.సన్యాసినాయుడు, కె.శివ, ఎస్.నారాయణప్పడు, ఆర్.ఆదినారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ కార్యదర్శి సీహెచ్.వేణుగోపాలరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నుంచి ఎ.మురళీకృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు.